సాక్షి
సిద్దిపేట

మంగళవారం ı 11 ı ఫిబ్రవరి ı 2025



ఎంసీహెచ్ కేంద్రం..

హుస్నాబాద్‌లో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి గ్రహణం వీడటం లేదు. -వివరాలు 8లో ▸



పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్..

జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా చేపడుతున్నామని డీఐఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు 8లో ▸

రేపటినుంచి సిటీ పోలీస్‌యాక్టు

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో బుధవారం నుంచి సిటీ పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 27వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించరాదన్నారు.

సౌర పంట



భూముల్లో సోలార్ ప్లాంట్లు

- పీఎం కుసుమ్ పథకం కింద అమలు
- 2 మెగావాట్ల వరకు ఏర్పాటు చేసుకునే అవకాశం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 430 విద్యుత్ సబ్‌స్టేషన్ల గుర్తింపు
- ఈ నెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

సాగు, బీడు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఆదాయం పొందవచ్చు. ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం -కుసుమ్) కింద పొలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానించింది. కనీసం 0.5 నుంచి 2 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందు కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో 430 విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

సామర్థ్యం (మెగావాట్లు)	అవసరమైన భూమి (ఎకరాలలో)	వ్యయం (రూ.కోట్లలో)
0.5	2	1.5
1	4	3
1.5	6	4.5
2	8	6

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూముల్లో 0.5 మెగావాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం వరకు కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటరీ కమిషనర్ (టీజీఈఆర్సీ) ఒక్కో యూనిట్‌కు రూ.3.13లను నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేయనున్నారు. దీంతో రైతులకు ఆదాయం రానుంది.

ఇప్పటి వరకు 38 మంది దరఖాస్తు

రైతులు సొంత భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 38 మంది దరఖాస్తు చేశారు. ఇందులో సిద్దిపేట 20, మెదక్ 9, సంగారెడ్డి 9 మంది ఉన్నారు. టీజీ రెడ్కో సోలార్ ప్లాంట్ మెగావాట్‌కు రూ.5వేలు దరఖాస్తు ఫీజును 18శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాలి. ప్లాంట్ కెపాసిటీ మెగావాట్‌కు మించితే రూ.10వేలు దరఖాస్తు ఫీజుతో పాటు 18శాతం జీఎస్టీ చెల్లించాలి. ఎంపికైన నిర్వాహకుడు లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్ఓఏ) జారీ చేసిన 10 నుంచి 15రోజుల్లోగా బ్యాంకు గ్యారంటీగా మెగావాట్‌కు రూ. 5లక్షల చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పీఎం కుసుమ్ కింద పంట పొలాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు, tgredco.telangana.gov.in, www.pmkusum.telangana.gov.inలో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసిన తర్వాత రెడ్కో అధికారులు ఫీల్డ్ విజిట్ చేయనున్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ నుంచి 5కిలోమీటర్లు ఉన్న భూములకు రెడ్కో వారు అనుమతి ఇవ్వనున్నారు.

ఆసక్తి ఉన్నవారందరూ దరఖాస్తు చేసుకోండి

సొంత భూముల్లో రైతులు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్ స్టేషన్ ఐదు కిలో మీటర్ల పరిధి ఉన్న వారికి ప్లాంట్ ఏర్పాటు చేసుకునే అనుమతి ఇస్తాం.

– వేణుగోపాల్,
ఇన్‌చార్జ్ డీఎం, సిద్దిపేట



సంగారెడ్డిలో రైతు భూములను పరిశీలిస్తున్న రెడ్కో అధికారులు

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించండి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని 26 మండలాల్లో ఎంపిక చేసిన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ ఇంజనీర్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 26న ఎంపిక చేసిన గ్రామాల్లో 2,543 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ చేశామన్నారు. అందజేశామన్నారు. త్వరలో పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పీహెచ్‌సీ, సబ్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ దామోదర రావు, డీఎంహెచ్ఓ పల్విన్ కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు వేగిరం చేయండి

మెదక్– ఎల్కతుర్తి నేషనల్ హైవే పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్ హాల్ లో నేషనల్ హైవే ఇంజనీర్, కాంట్రాక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ – ఎల్కతుర్తి నేషనల్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా హుస్నాబాద్ టౌన్ లో వాటర్ పైప్ లైన్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసి జంక్షన్ అభివృద్ధి పనులు మొదలు పెట్టాలన్నారు. పందిల్ల దగ్గర బ్రిడ్జి నిర్మాణ పనుల పూర్తి చేయాలన్నారు. పందిల్ల –కూచన్‌పల్లి వద్ద టోల్‌గేట్ నిర్మాణానికి రెవెన్యూ అధికారుల సహకారంతో భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నేషనల్ హైవే ఏఈలు అనురాగ్, శ్రీనివాస రావు, కాంట్రాక్టర్ నేమి చందు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మొదటివిడత, రెండో విడత ఎన్నికల పోలింగ్‌కు అధికారులకు కేటాయింపు ప్రక్రియను నిర్వహించారు. మొత్తంగా 11,867 మంది అధికారులను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలన్నారు.

ఒకే ఊరు.. ఒకే రోజు.. ఐదుగురు మృతి

- శోకసంద్రంలో మోతె
- చెరువులో పడి ఒకరు..
- చికిత్స పొందుతూ మరొకరు
- అనారోగ్యంతో ముగ్గురు



వెంకటేశం మృతదేహాన్ని బయటకుతీస్తున్న ఈతగాళ్లు

మిరుదొడ్డి(దుబ్బాక): చెరువులో పడి ఒకరు, చికిత్స పొందుతూ ఇంకొకరు, అనారోగ్యంతో మరో ముగ్గురు.. ఇలా ఒకే రోజు ఒకే గ్రామంలో మొత్తం ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో సోమవారం చోటు చేసుకోవడంతో గ్రామం శోక సంద్రంలో మునిగిపోయింది. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో విషాదఛాయలు నెలకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాలేరు వెంకటేశం (71) గ్రామ శివారులోని చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతునికి భార్య నాగమణితో పాటు, కొడుకు సాయిబాబా ఉన్నాడు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన వడ్డె నర్సవ్వ (63) అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా దేవుని మల్లమ్మ (79), బాలకిష్టయ్య (68), చిలుక మల్లేశం (55)లు అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస వదిలారు. ఒకే రోజు ఐదుగురు మృతి చెందడంతో గ్రామమంతా శోకసంద్రమైంది.

చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

సిద్దిపేటలో అవగాహన ర్యాలీ

సిద్దిపేటకమాన్: యూనియన్ బ్యాంకు చిన్న తరహా పరిశ్రమలకు వ్యాపార నిమిత్తం రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు అన్నారు. ఫైనాన్సియల్ లిటరసీ, సైబర్ నేరాలు, బ్యాంకు రుణాలపై యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది సోమవారం అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం హరిబాబు మాట్లాడుతూ..బ్యాంకు రుణ సదుపాయాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం, పిన్, ఓటీపీ నెంబర్లు గుర్తు తెలియని వ్యక్తులకు తెలపకూడదని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకులలో వ్యక్తిగత, వ్యాపార, సీసీ, టర్మ్ లోన్స్ అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ వికాస్, డిప్యూటీ రీజినల్ హెడ్ సంజయ్‌చౌదరి, గోపి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యాసరస్వతికి విశేషాభిషేకం



అమ్మవారి దివ్యమంగళ రూపం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో మాఘ శుద్ధ త్రయోదశి సోమవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు వార్షికోత్సవ పూజలకు అంకురార్పణ చేశారు. కొండపైన గర్భగుడిలో మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, పూలమాలికలు, సర్వాభరణాలతో కమనీయంగా అలంకరించారు. చండీహోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రంలోని శనైశ్చర, లక్ష్మీగణపతి, కల్యాణ వేంకటేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, శంభులింగేశ్వరాలయాలలో దేవతామూర్తులను విశేషాలంకృతులను చేశారు. వార్షికోత్సవ వేడుకలలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నోరి పురస్కారం



సరస్వతిని సత్కరిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ కవియిత్రి మంచినీళ్ల సరస్వతి నోరి పురస్కారాన్ని అందుకున్నారని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. సోమవారం నగరంలో నోరి నరసింహశాస్త్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న సరస్వతికి జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



పోతారంలో శివపంచాయతన ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తన స్వగ్రామం పోతారంలో శివపంచాయతన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు. కాలయాపన చేయడం సరికాదన్నారు. కేవలం ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి హేయమైన చర్య



సీఐ సైదాకు వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ ఐక్యవేదిక సభ్యులు

గజ్వేల్‌రూరల్: దేవాలయ అర్చకులపై దాడి హేయమైన చర్య అని, దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని గజ్వేల్ అర్చక సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గజ్వేల్ పట్టణంలో సీఐ సైదాకు బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకులపై కొందరు వ్యక్తులు దాడి చేసి బెదిరింపులకు గురిచేశారని, దాడికి పాల్పడిన వ్యక్తులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అర్చకులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బ్రాహ్మణ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 24,441 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లా వ్యవసాయాశాఖ అధికారి రాధిక



మాట్లాడుతున్న రాధిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో సాగు చేసిన పంటలకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు అడిగిన వెంటనే అందించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రాధిక మాట్లాడారు. జిల్లాలో డీలర్ల వద్ద 14,511.13 మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 5,697.80 మెట్రిక్ టన్నులు, కంపెనీల గోడౌన్‌ల వద్ద 943.24 మెట్రిక్ టన్నులు, మొత్తంగా 24,441.17 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో యూరియా 9,834.40 మెట్రిక్ టన్నులు, డీఏపీ 927.68 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 11,224.59 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2,191.58 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 263.25 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. అందువలన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ సాగుకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు ఆమోదం

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా రాజగోపాల్‌పేట వద్ద సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే హరీష్‌రావు చెప్పారు. గ్రామంలో ఫుట్‌పాత్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని గ్రామస్తులు తనతో మొర పెట్టుకోవడంతో కేంద్ర మంత్రికి లేఖ రాశామన్నారు. స్పందించిన గడ్కరి సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు లేఖలో పేర్కొన్నారన్నారు.

ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యంగా సాగుదామని, వ్యాపారస్తులు తమ సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూద్దామన్నారు. ముఖ్యంగా వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లలో సరుకులు ఇవ్వొద్దని సూచించారు. ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. ప్రజలు మార్కెట్‌కు వెళ్లినప్పుడు తప్పనిసరిగా టిఫిన్ బాక్స్, జ్యూట్ బ్యాగులను తీసుకువెళ్లాలని సూచించారు. పట్టణ ప్రజలు స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీసీసీ చీఫ్ వద్దకు గ్రూపుల లొల్లి

గజ్వేల్ కాంగ్రెస్ పంచాయితీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వద్దకు చేరింది. సోమవారం కరీంనగర్ వెళ్తున్న పీసీసీ చీఫ్‌కు గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. పనిలో పనిగా అసమ్మతి నేతలపై ఫిర్యాదు చేశారు. వారి చర్యల వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతోందని, గ్రూపులు కడుతున్న వారిని కట్టడి చేయాలని కోరారు. ఈ అంశం ప్రస్తుతం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

- అసమ్మతి నేతలపై నర్సారెడ్డి ఫిర్యాదు
- గ్రూపులు కడుతున్న వారిని కట్టడిచేయాలని విజ్ఞప్తి
- పార్టీలో చర్చనీయాంశంగా మారిన పరిణామం



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అసమ్మతి నేతలపై ఫిర్యాదు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు వర్గాలుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. ఈ రెండు వర్గాల మధ్య రోజురోజుకూ దూరం పెరుగుతుందే తప్పా.. సయోధ్య కుదరడం లేదు. దీనిని కట్టడి చేయడానికి అధిష్టానం వైపు నుంచి చర్యలు కూడా కరువయ్యాయి. ఫలితంగా కార్యకర్తలు, నాయకులు రెండు వర్గాల మధ్యన నలిగిపోతున్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా రెండు వర్గాలు వేర్వేరుగా చేపడుతూ తప్పుడు సంకేతాలను పంపుతున్నారు. మంత్రుల పర్యటనల సందర్భంలోనూ ఇది కనిపిస్తున్నది. గతేడాది డిసెంబర్ 3న ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలోనూ తమ నాయకుడికి అవమానం జరిగిందంటూ నర్సారెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సంగతి విదితమే. దీని తర్వాత కూడా నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య విభేదాలు తరుచూ బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా సోమవారం కరీంనగర్‌లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని తరలివెళ్తున్న పీసీసీ అధ్యక్షుడికి డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అధ్వర్యంలో గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఎస్–4 రెస్టారెంట్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశం ముగియగానే నర్సారెడ్డి అసమ్మతి నేతలపై ఫిర్యాదు చేశారు. కొందరు నేతలు గ్రూపులు కట్టడం వల్ల పార్టీకి నష్టం జరుగుతున్నదని వాపోయారు. దీనిని వెంటనే కట్టడి చేయాలని కోరారు.

కేసీఆర్ ఇలాకాలో బలపడుతున్న సమయంలో

గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓట్లు రెట్టింపు చేశామని నర్సారెడ్డి తెలిపారు. పార్టీ బలంగా మారిన సమయంలో కొందరు గ్రూపులు కట్టడం వల్ల నష్టం జరుగుతుందని చెప్పారు. ఇదే సమయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ సైతం మాట్లాడుతూ.. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నర్సారెడ్డికి సమాచారం లేకుండానే గజ్వేల్ పట్టణంలో అసమ్మతి నేతలు పార్టీ కార్యాలయం పారంభించారని పీసీసీ చీఫ్ దృష్టికి తెచ్చారు. వేర్వేరుగా సమావేశాలను సైతం నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారి మాటలను విన్న మహేశ్‌కుమార్ గౌడ్ నవ్వుతూ సమాధానమివ్వకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదే క్రమంలో సాయంత్రం బండారు శ్రీకాంత్‌రావు వర్గం నేతలు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును తీసుకొని గజ్వేల్‌కు రావడం గమనార్హం. తాజాగా గజ్వేల్ కాంగ్రెస్ పంచాయితీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెంతకు చేరిన నేపథ్యంలో ఇప్పటికైనా అధిష్టానం నుంచి రెండు వర్గాల మధ్య సయోధ్య కుదుర్చుతుందా? లేదా? అని కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. గ్రూపులను కట్టడి చేయకపోతే పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ నష్టం తప్పదని అభిమానులు వాపోతున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

అమరవీరుల స్తూపానికి నివాళులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి స్తూపం వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి నామినేషన్‌కు కరీంనగర్‌కు వెళ్తూ మార్గమధ్యంలో సిద్దిపేటలో ఆగి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అంతకు ముందు కాంగ్రెస్ శ్రేణులు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లికృష్ణారావు, షబ్బీర్ అలీ, మైనంపల్లి హనుమంతరావులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి, పూజలహరి కృష్ణ, గోపీకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ చీఫ్ తదితరులు

క్లుప్తంగా

మోదీ 'పరీక్షా పే చర్చ'

వీక్షించిన నవోదయ విద్యార్థులు



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): విద్యార్థుల్లో భయాందోళన తొలగించడమే లక్ష్యంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించగా వర్గల్ నవోదయ విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఎంపీ హాల్‌లో ఇందుకోసం బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. పరీక్షల తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని మోడీ ఈ కార్యక్రమం ద్వారా పలు సూచనలు చేశారని ప్రిన్సిపాల్ దాసీ రాజేందర్ పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థి ఇతరులతో కాకుండా తన తోతాను పోటీ పడి లక్ష్యాలు సిద్ధించుకోవాలని సూచించినట్లు వివరించారు. కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పుష్పవేణి

చిన్నశంకరంపేట(మెదక్): హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోర్త్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. మార్షల్ ఆర్ట్స్ కటాఫ్ విభాగంలో కె.రేణుక బంగారు పతకం, కావ్య, అనుషా రజత పతకాలు సాధించినట్లు ఎంఈఓ పుష్పవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుపై..

పోతిరెడ్డిపల్లిలో ఏసీపీ విచారణ



విచారణ చేస్తున్న ఏసీపీ సతీశ్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి సంబంధించి ఇటీవలె వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుపై సోమవారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ విచారణ చేశారు. గ్రామస్తులతో ఏసీపీ మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అందరూ కలిసిమెలిసి ఉంటూ పాల్గొనాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నడుచుకోవాలన్నారు. గ్రామంలో ప్రజల రక్షణకు, సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీహెచ్ కేంద్రం

ప్రారంభానికి గ్రహణం

నిరుపయోగంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి గ్రహణం వీడటం లేదు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది అవుతున్నా ఇంకా తెరుచుకోవడం లేదు. దీంతో మహిళలు ప్రసవాల కోసం పట్టణాలు, నగరాలకు వెళ్లాలంటే ఎంతో ప్రయాసతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రసవాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కాన్పులు జరిగేలా చేసేందుకు నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనానికి మోక్షం ఎప్పుడని హుస్నాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

– హుస్నాబాద్

- భవనం పూర్తయి ఏడాది
- రూ.12.50 కోట్లతో 50 పడకలు
- డాక్టర్లు, సిబ్బంది నియామకాల్లో ప్రభుత్వం జాప్యం
- వైద్య పరికరాలు సిద్ధం
- అందుబాటులోకి వస్తే ప్రసవాలు సులభతరం
- హుస్నాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రజలకు తప్పని తిప్పలు



ప్రారంభానికి నోచుకోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో కాన్పులు స్థానికంగా జరిగేలా 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. రూ.12.50 కోట్లు వ్యయం కాగల ఈ ఆరోగ్య కేంద్రానికి 5, డిసెంబర్, 2022న అప్పటి మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తి చేసి దాదాపు ఏడాది అవుతుంది. కానీ నేటికీ అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. ఇది ప్రారంభిస్తే నియోజకవర్గంలోని 7 మండలాలకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నిరుపేద మహిళలు ప్రసవాల కోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఉండదు.

సిద్ధంగా వైద్య పరికరాలు

మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే గర్భిణులు, పుట్టబోయే పిల్లలకు ఆరోగ్య పరంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్మాణం పూర్తి చేసుకున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం వైద్య పరికరాలు అన్ని సిద్ధంగా ఉన్నాయి. ఆస్పత్రి భవనంలో విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించేంత వరకు ఆస్పత్రి భవన భద్రత అంతా సంబంధిత కాంట్రాక్టర్‌దే. భవనం వెనుకాల పాఠశాల గ్రౌండ్‌లో విద్యార్థులు ఆటలు ఆడుతుండగా కిటికీల అద్దాలు పగిలిపోతున్నాయి. భవనం పాడైపోక ముందే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి డాక్టర్లు, సిబ్బంది నియామకం జరిగేలా చర్యలు తీసుకొని ఆస్పత్రిని త్వరగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బంది నియామకం లేకపోవడమేనా..



ఎంసీహెచ్ భవనం పూర్తి కాగా ఏడాది నుంచి ప్రభుత్వం డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇదే ప్రధాన కారణంగా స్థానికులు చెబుతున్నారు. దాదాపు 100 మంది వరకు డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది ఆస్పత్రికి అవసరం ఉంది. ముఖ్యంగా గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, అనెస్తీయా, రేడియాలజిస్ట్‌లు 24 గంటలు పర్యవేక్షణలో ఉండి తల్లి, బిడ్డలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. స్టాఫ్ నర్స్‌లు, నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్కానింగ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు కావాలి రోజు వారి చెకప్ కోసం ప్రత్యేక సిబ్బంది కూడా అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరుగుతున్నా సరిపోయేంత డాక్టర్లు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో క్రిటికల్‌గా ఉన్న కేసులను ఇతర పట్టణాల్లో ఉండే ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. మాతా శిశు కేంద్రం అందుబాటులోకి వస్తే నిష్ణాతులైన డాక్టర్లతో ఎంతటి సీరియస్‌గా ఉన్నప్పటికీ ఇక్కడే ప్రసవం జరిగే అవకాశం ఉంటుంది.

డాక్టర్లను నియమించాల్సి ఉంది



మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తయింది. వైద్య పరికరాలు కూడా వచ్చాయి. డాక్టర్లు, సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ఇతర పట్టణాలకు వెళ్లకుండా కాన్పులు ఇక్కడే జరుగుతాయి. ఎంతటి క్రిటికల్ కాన్పులైన ఇక్కడే జరిపేలా నిష్ణాతులైన వైద్య నిపుణులు ఉంటారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– డాక్టర్ రమేశ్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, హుస్నాబాద్

భారీ అగ్ని ప్రమాదం

- రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సామగ్రి దగ్ధం



కాలి బూడిదైన సామగ్రి

జహీరాబాద్: ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్ క్రాస్‌రోడ్డు వద్ద స్థానికుడు శంకర్ ఎలక్ట్రానిక్స్ దుకాణం నడుపుతున్నాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎలక్ట్రిక్ వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని షటర్లను పగులగొట్టి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

వ్యక్తి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరుశరాములు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని అల్వాల గ్రామ పంచాయతీ మధిర గ్రామం రాంనగర్‌కు చెందిన గండ్ల గణేశ్ 2019లో పోలీసులతో దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులకు బెయిల్ ద్వారా బయటకు రాగా కేసులో భాగంగా అప్పుడప్పుడూ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. కానీ గతేడాది కాలంగా గణేశ్ కోర్టుకు హాజరు కాకుండా పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. సోమవారం గణేశ్‌ను చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

డ్రోన్‌ల వినియోగంపై చర్చ

ములుగు(గజ్వేల్): ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డ్రోన్ సెంటర్ ఏర్పాటు, ఉద్యాన పంటల్లో డ్రోన్‌ల వినియోగంపై సోమవారం అధికారులు సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలకు డ్రోన్ టెక్నాలజీ అప్లికేషన్లలో సహకారాన్ని పెంపొందించడానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌తో ఒక అవగాహన ఒప్పందం(ఎంఓయు) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రధాన ఉద్యాన పంటల్లో డ్రోన్ ఆధారిత అప్లికేషన్ల కోసం కచ్చితమైన వ్యవసాయ పద్ధతులను నిర్మించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్ఓపీ)అభివృద్ధి చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ, ఆయా సంస్థల అధికారులు జీవీ సుబ్బారెడ్డి, రామకృష్ణ, వినోద్ కులకర్ణి, భగవాన్, రాజశేఖర్, విజయ, సీనివాసన్, సునందిని, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

- రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు
- బైక్‌ను ఢీకొట్టిన కారు

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందగా, మరో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని అక్కన్నపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అక్కన్నపేటకు చెందిన సల్లావుద్దీన్ కాట్రియాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. స్కూల్ అయిపోయాక బైక్‌పై అక్కన్నపేట వస్తున్నాడు. దారిలో లక్ష్మాపూర్ వద్ద రైల్వేశాఖ గ్యాంగ్‌మెన్‌గా పని చేస్తున్న అక్కన్నపేటకు చెందిన అశోక్ సల్లావుద్దీన్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కాడు. వీరు అక్కన్నపేట అటవీ ప్రాంతంలోకి రాగానే ఎదురు వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఇందులో చిక్సి పొందుతూ సల్లావుద్దీన్ మృతి చెందాడు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): రైసుమిల్లులో అనుమానస్పందంగా వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ రైసుమిల్లులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. రాంపూర్ గ్రామంలోని ఉమా సంగమేశ్వర రైస్ మిల్లులో గ్రామానికి చెందిన గోండ కృష్ణ (28) కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు నిర్వహించి ఉదయం వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే కృష్ణ మరో ఇద్దరు వ్యక్తులతో బైక్‌పై మిల్లుకు వచ్చాడు. మిగితా ఇద్దరు వెళ్లిపోయారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రైసుమిల్లు సంపులో మృతదేహమై కనిపించాడు. తోటి కూలీలు కృష్ణ మృతదేహాన్ని బయటకు తీసి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది చనిపోయాడని చెప్పడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు చెప్పారు. కృష్ణ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా, సోమవారం కృష్ణ పనికి రాలేదని మిల్లు యజమానులు చెబుతున్నారు. మృతురాలి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కృష్ణ (ఫైల్)

బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని పలు కాలనీలు, బస్టాండ్ పరిసరాలను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ హోటల్ వద్ద టిఫిన్ చేస్తున్న మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. బస్టాండ్ పరిసరాల్లో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కొంత భాగాన్ని కోల్పోతున్న షాపులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు ఉన్నారు.

సంజీవ్ మృతిపై మళ్లీ విచారణ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ వర్కర్‌గా పనిచేసే సంజీవ్ ఇటీవల డంప్‌యార్డ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, మృతుడి సెల్‌ఫోన్‌లో దొరికిన ఆధారాలతో కేసును మరోసారి ఆ దిశగా విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మెదక్ మున్సిపాలిటీలోని మున్సిపల్ అధికారులను, సిబ్బందిని విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం కొంతమంది సిబ్బందిని విచారణకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ నాగరాజును వివరణ కోరగా కేసు విచారణ కొనసాగుతుందన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

- డీఐఈఓ రవీందర్ రెడ్డి
- దుబ్బాకలో పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

దుబ్బాకటౌన్: జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ కన్వీనర్ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, కమిషనర్ కృష్ణాదిత్య ఆదేశాల మేరకు అన్ని ప్రయోగ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 62 కేంద్రాల్లో అన్ని విడతల్లో జనరల్, ఒకేషనల్ గ్రూపులకు 11,090 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలు రాస్తున్నారన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని, అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వాహణ కమిటీ సభ్యుడు గంగాధర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఐఈఓ రవీందర్ రెడ్డి

కంది రైతులకు ఆన్‌లైన్ రంది

దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి

హుస్నాబాద్‌రూరల్: కంది రైతులకు ఆన్‌లైన్ రంది తప్పేలా లేదు. రైతులు పండించిన కందులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సోమవారం కోహెడ మండలానికి చెందిన మంద శంకర్ పండించిన 10 క్వింటాళ్ల కందులను అమ్మేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. కానీ అతడి పేరు ఆన్‌లైన్‌లో లేదని కందులు కొనుగోలు చేయమని నిర్వాహకులు చెప్పారు. రైతు దంపతులు ఏం చేయలేక మార్కెట్‌కు తెచ్చిన కందులను సంచుల్లో నింపి బయట దళారీకి రూ.6,500కి అమ్ముకొని వెళ్లిపోయాడు. ఏఈఓలు పత్తి పంటను నమోదు చేసినప్పుడు కంది పంట నమోదు చేయాలె కదా? అధికారుల నిర్లక్ష్యంతోనే రూ.2 వేలు ఆటో కిరాయి నష్టం, క్వింటాల్‌కు రూ.1,000 నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్ స్పందించి రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి అమ్ముకొనేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.



మార్కెట్‌కు కందులను తీసుకెళ్తున్న రైతులు

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

అప్పుల బాధతో వ్యక్తి

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారు రవీందర్(35)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పోషణ, పంటల సాగుకు సుమారు రూ.4.5లక్షల వరకు అప్పులు చేశాడు. ఇవి తీర్చే మార్గంలేక తీవ్ర మనోవేదనకు గురైన సోమవారం వ్యవసాయం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..

చేగుంట(తూప్రాన్): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోప్పుల్లపల్లి బాలయ్య(79) కొద్ది రోజులుగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం సాయంత్రం పొలం పనులకని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా స్థానిక చెరువు గట్టు వద్ద బాలయ్య చెప్పులను గుర్తించారు. చెరువులో వెతకగా బాలయ్య మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



రాజు(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన పత్తి రాజు(45), శ్రీలత దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం భార్య ఉపాధి పనికి వెళ్లగా జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడు

మనోహరాబాద్(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి శివారులో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద ఆధార్ కార్డు చూడగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జంజీర్ చంపాకు చెందిన రాహుల్‌కుమార్ (25)గా తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ సుభాష్‌గౌడ్‌ని వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఇక్కడ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడని విచారణ చేస్తున్నామన్నారు.

అక్రమ రవాణాకు అడ్డేది?

- రామాయంపేట కేంద్రంగా కలప తరలింపు
- స్టాక్ నిల్వచేసి మరీ లారీల్లో ఇతర ప్రాంతాలకు
- అనుమతులు లేకుండానే చెట్లు నరికివేత
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట కేంద్రంగా కొద్ది రోజులుగా అక్రమ కలప రవాణా జోరుగా కొనసాగుతోంది. యూకలిప్టస్, సుబాబుల్ చెట్లను సమీప ప్రాంతాల్లో నరికివేసి ముందుగా రామాయంపేట మున్సిపాలిటీ శివారులో స్టాక్ నిల్వ చేస్తున్నారు. అనంతరం ఆదివారం, ఇతర సెలవు దినాలు, రాత్రివేళల్లో నాలుగైదు లారీలు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారానికి గాను సంబంధిత శాఖ అధికారుల అండదండలున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూకలిప్టస్ చెట్లు నరకాలంటే ముందస్తు సంబంధిత పంచాయతీ కార్యదర్శి అనుమతితోపాటు దానిని తరలించి స్టాక్ పెట్టడానికిగాను అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. దీంతోపాటు ప్రతీ చెట్టుకు రూ.50 ముందుగానే ఆన్‌లైన్‌లో చెల్లించి అనుమతులు పొందాలి. ఇవేమి లేకుండానే యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగుతుంది. నామమాత్రంగా రెండు, మూడు చెట్లకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మిగితా వాటిని అక్రమంగా నరికేసి సొమ్ము చేసుకుంటున్నారు. రామాయంపేట కేంద్రంగా ముగ్గురు కాంట్రాక్టర్లు కలప వ్యాపారం పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. అలాగే, వేప, చింత, ఇతర చెట్లను నరకాలంటే ముందస్తుగా దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉండగా, ఇవేమీ లేకుండానే లారీల్లో, ట్రాక్టర్లలో నేరుగా హైదరాబాద్, సమీపంలోని సామిల్లకు తరలిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ రవాణా పెద్ద ఎత్తున కొనసాగుతుంది.



రామాయంపేట శివారులో లారీలో కలప తరలింపు

అనుమతులు తప్పనిసరి

కలపను నరికి స్టాక్ పెట్టాలంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. రామాయంపేటలో మాత్రం స్టాక్ పెట్టడానికి అనుమతి తీసుకోలేదు. యూకలిప్టస్ చెట్లు తొలగించాలంటే ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొంది చెట్టుకు రూ. 50 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల దాడులు నిర్వహించి కలప తరలిస్తున్న పది వాహనాలకు జరిమానాలు విధించాం.

– శ్రీను నాయక్, డిప్యూటీ రేంజ్ అధికారి, రామాయంపేట